





సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం, క్వీన్స్ లాండ్ అధికారులు, సింగరేణి సీఎండీ

## కీలక ఖనిజాల మైనింగ్‌కు తెలంగాణ భాగస్వామ్యం

గోదావరిఖని, ఫిబ్రవరి 24: క్వీన్స్ ల్యాండ్(అస్ట్రేలియా) ప్రభుత్వంతో కీలక ఖనిజాల టెక్నాలజీ, మైనింగ్ రంగంలో తెలంగాణ భాగస్వామ్యంకు ముందడుగు వేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారనం జరిగిన క్వీన్స్ ల్యాండ్ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణశాఖ మంత్రి రోస్ బేట్స్, అ రాష్ట్ర అధికారుల బృందంతో నిర్వహించిన కీకల ఖనిజాల ఉత్పత్తి, వ్యాపార విస్తరణ అవకాశాల సమావేశంలో ఉత్పత్తి, విక్రయానికి పరస్పర లబ్ధి చేకూరే వ్యాపార ఒప్పందంపై ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. తెలంగాణతో పాటు దేశంలో విద్యుత్ వాహనాలు, సోలార్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్ విధానాలకు డిమాండ్ నేపథ్యంలో ఈ రంగానికి అవసరమైన కోబాల్ట్, ఇండియం, క్రోమియం, టైటానియం వంటి 11 రకాల కీలక ఖనిజాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఈ ఖనిజాల లభ్యత క్వీన్స్ లాండ్‌లో అధికంగా ఉన్నందున వీటి ఉత్పత్తి, విక్రయానికి అవగాహనకు వచ్చినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇక్కడ క్వీన్స్ లాండ్ ప్రభుత్వ అధికారులు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మైమెంట్, జీఎం కోఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం ఉన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు కోడ్ వర్తించదా...?

రామగిరి, ఫిబ్రవరి 24 ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్మరించారు. మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీనుబాబు జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘించడం కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సోమవారం మండలంలోని నాగెపల్లి, బేగంపేట తదితర గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం స్థానికంగా చర్చనీయాశంగా మారింది. అధికారులు చోద్యం చూస్తుండడం కూడా విమర్శలకు తావిచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై, అందుకు సహకరిస్తున్న అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో మినీ లైబ్రరీ

మంథని రూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని కన్నాల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అన్నదమ్ములు చిగిరి శివకుమార్, సాయికుమార్ మినీ లైబ్రరీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ మినీ లైబ్రరీలో సనాతన సంస్థ సనాతన ధర్మం, ఆధ్యాత్మికత, ఆధ్యాత్మిక సాధన, జాతీయ సంక్షేమంపై రాసిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. భక్తులు ఈ గ్రంథాలను అర్థం చేసుకోవడానికి సహాయపడటానికి ప్రత్యేక పుస్తకాల ద్వారా సమాచారం పంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి ముఖేష్ శర్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంతింతై.. ఖోఖో కోచ్‌గా ఎదిగి

### ఇటీవల విశ్వవిజేత జట్ల శిక్షకుడు లంబాడి తండా బిడ్డే



క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న ఖోఖో జాతీయ సహాయ కోచ్ నరేష్

- బాల్యం నుంచే స్వదేశీ క్రీడలో ఇస్లావత్ నరేశ్ నాయక్ ప్రతిభ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట
- రైల్వే శాఖలో ఉద్యోగం.. శిక్షకుడిగా నియామకం
- అతని సారథ్యంలో ఇటీవల దేశానికి రెండు వరల్డ్ కప్‌లు



ఖోఖో ఛాంపియన్ ట్రోఫీతో ఖోఖో జాతీయ సహాయ కోచ్ నరేష్




ఢిల్లీలో జరిగిన ఖోఖో క్రీడలో ప్రపంచ ఛాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులతో నరేష్ నాయక్

ధర్మారం, ఫిబ్రవరి 24: బాల్యం నుంచే ఖోఖో క్రీడ పై ఉన్న మక్కువ అతన్ని క్రీడా ఆణిముత్యంగా నిలిపింది. చదువుకునే రోజుల్లోనే ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా పట్టుదలతో చేసిన సాధన ది బెస్ట్ స్పోర్ట్స్‌మెన్‌గా మార్చింది. ఖోఖో రాణించి, అనేక పథకాలు సాధించిన ధర్మారం మండలం బంజరుపల్లి లంబాడితండా (బీ) గ్రామానికి చెందిన ఇస్లావత్ నరేశ్‌నాయక్ రైల్వే శాఖలో కొలువు సాధించి, కోచ్‌గా నియమితులై అనేక జట్లకు తర్ఫీదునిచ్చాడు. ఇటీవలే జాతీయ సహాయ శిక్షకుడిగా నియమితులై, తన మెళకువలతో పురుషులు, మహిళల విభాగాల్లో దేశానికి రెండు ప్రపంచకప్ టైటిల్స్‌ను తెచ్చిపెట్టాడు. మన దేశ ఖోఖో క్రీడాఖ్యాతిని ప్ర పంచానికి చాటిచెప్పిన నరేశ్‌పై 'నమస్తే' ప్రత్యేక కథనమిది.

### తండాలో పుట్టి.. ఖోఖోలో ఆరితేరి..

బంజరుపల్లి లంబాడి తండా (బీ) గ్రామానికి చెందిన ఇస్లావత్ సంతారి, రూపా నాయక్ దంపతులకు ఇద్దరు కొడుకులు శ్రీనివాస్, నరేష్. శ్రీనివాస్ ధర్మారం ప్రభుత్వ పాఠశాల టీచర్. రెండోవాడైన నరేష్ బాల్యం నుంచే ఖోఖోపై ఆసక్తి పెంచుకున్నాడు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తిచేశాడు. 1995లో టెన్త్ పూర్తి చేశాడు. 2002లో కాకినాడలో ఇంటర్ పూర్తి చేశాడు. 2005లో కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ చేశాడు. కాగా, నరేష్ 1996లో హుస్నాబాద్ గురుకుల విద్యాలయంలో చదువుతున్న టైంలోనే కర్నాటకలో తెలంగాణ జట్టు తలుపున ఆడి ప్రథమ స్థానంలో నిలిచి తన విజయ ప్రస్థానాన్ని మొదలుపెట్టాడు. 2000లో పంజాబ్‌లోని సంగాపూర్, 2001లో మహారాష్ట్రలో జరిగిన సీనియర్ నేషనల్ క్రీడలో సత్తాచాటాడు. 2006లో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన సీనియర్ నేషనల్ ఇండియన్ రైల్వే టీం తరపున గోల్డ్ మెడల్ సాధించాడు. 2001లో పంజాబ్‌లోని పార్టీయాల, 2002లో హైదరాబాదులో జరిగిన నేషనల్ క్రీడల్లో రాష్ట్ర తరపున ఆడి బ్రాంచ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నాడు. తర్వాత రైల్వే శాఖ తరపున ఆడి లెక్కలేనన్ని పథకాలు సాధించాడు.

### స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం

నరేష్ ఖోఖోలో ప్రతిభచూపి ఎన్నో పతకాలు సాధించడంతో రైల్వే శాఖలో ఉద్యోగం వరించింది. సౌత్ ఇండియా రైల్వే విభాగంలో 2006లో మెకానిక్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా మహారాష్ట్రలోని నాందేడ్‌లో నియమిలయ్యారు. ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని లాలాగూడలో చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ తర్వాత రైల్వే శాఖలో ఖోఖో క్రీడా కోచ్‌గా నియమితులైన నరేశ్, ఆ శాఖ ద్వారా ఎన్నో పతకాల సాధనకు కృషి చేశాడు. నరేష్ శిక్షణతో ఖోఖోలో 2006 నుంచి 2023 వరకు వివిధ రాష్ట్రాలలో జట్లు సత్తా చాటాయి.

### జాతీయ సహాయ కోచ్ ప్రస్థానం

నరేష్ ఖోఖో క్రీడలో జాతీయ సహాయ కోచ్‌గా నియమితులై తన సత్తా చాటాడు. ప్రపంచ చాంపియన్ షిప్‌ను దేశానికి సాధించి పెట్టడంలో విజయవంతమయ్యాడు. 2024 డిసెంబర్ 10న ఖోఖో క్రీడా సహాయ కోచ్ నియమితులైన వెంటనే, అదే రోజు, మరుసటి రోజు వరల్డ్ కప్ పోటీల కోసం 60 మంది మహిళలు, 60 మంది పురుషులకు వేర్వేరుగా నైపుణ్య పరీక్షలు నిర్వహించాడు. అత్యంత ప్రతిభచూపిన 15 మంది చొప్పున మహిళలు, పురుష జట్లకు 30 మందిని ఎంపిక చేశాడు. పోటీలకు సన్నద్ధం చేశాడు. ఈ నెల 13 నుంచి ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వరల్డ్ కప్ జరుగగా, సుమారు 26 దేశాల నుంచి 50 ఖోఖో జట్లు పాల్గొన్నాయి. ఇందులో మన దేశ మహిళలు, పురుషుల జట్లు సత్తా చాటి ప్రపంచ ఖోఖో చాంపియన్‌షిప్‌ను సాధించాయి.

### ఈ విజయం ఖోఖో క్రీడాకారులకు అంకితం

నా శిక్షణలో ఖోఖో క్రీడలో దేశంలోని మహిళలు, పురుషుల జట్లు ఒకే సమయంలో ప్ర పంచ ఛాంపియన్ షిప్ ట్రోఫీని సాధించ డం ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయాన్ని ఖోఖో క్రీడాకారులకు అంకితం ఇస్తున్న. నా శిక్షణలో వరల్డ్ చాంపియన్‌షిప్ సాధించడంతో ఎంతో గర్వంగా ఉంది. ఈ గ్రామీణ క్రీడకు ప్రపంచ ఖ్యాతి దక్కడం ఆనందంగా ఉంది. ఖోఖోలో రాణించిన వారికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కడమే కాదు ప్రభుత్వ ఉద్యోగాలు వరిస్తాయి.

**-నరేష్, జాతీయ సహాయ కోచ్**

## యువకుడి ఆత్మహత్యాయత్నం

ముత్తారం, ఫిబ్రవరి 24; మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన కలవేన రమేశ్(26) ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కలవేన స్వరూప- చంద్రమౌళిల కుమారుడు రమేశ్ గ్రామంలో నివసిస్తున్నాడు. సోమవారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగగా, గమనించిన కటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రమేశ్‌కు మార్చి రెండో తేదీన వివాహం నిశ్చయమైంది. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

## వివాహ వేడుకలకు హాజరు

ముత్తారం, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలో బీఆర్ ఎస్ నాయకుడు రాగుల భాగ్యలక్ష్మి - రాజేశం పటేల్ పుత్రుడు రాజు పటేల్ వివాహ వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఇక్కడ బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాడి రవీందర్ రావు, సర్పంచ్ లఘోరం మాజీ మండల అధ్యక్షుడు నూనే కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ గిరి విరేందర్, బీఆర్ ఎస్ నాయకులు అలువోజు రవీందర్ , జంగా వెంకట్ రెడ్డి, ఎర్రం సదానందం, గాదం శ్రీనివాస్, తిత్తుల శ్రీనివాస్ , శంకర్ , రాజయ్య, సారయ్యలు, బాలమల్లు, రాములు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై సీఐ దురుసు ప్రవర్తన

- బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 24: తన క్లయింట్ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ యువ న్యాయవాదిపై గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనరెడ్డి దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ మైనర్ బాలుడు చత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో పటాకులు కాల్చాడని పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. పోలీస్టేషన్‌లో సీఐ లేకపోవడంతో స్టేషన్ హాల్‌లో బాలుడు అక్కడే కూర్చున్నాడు. అతని కోసం గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన అడ్వకేట్ నామ్‌తాబాద్ కిరణ్‌జీ ఈ నెల 19న వన్‌టౌన్ పోలీస్టేషన్‌కు రాత్రి 10గంటల సమయంలో వెళ్లాడు. స్టేషన్‌కు వచ్చిన సీఐ అక్కడే ఉన్న న్యాయవాది కిరణ్‌జీని ఎవరంటూ ప్రశ్నించాడు. తాను న్యాయవాదినని, బాలుడి కోసం వచ్చానని చెప్పాడు. హాల్‌లోనే అందరు చూస్తుండగా న్యాయవాది అయితే ఏంటంటూ దురుసుగా ప్రవర్తించారు. న్యాయవాదిని బయటకు వెళ్లమని సిబ్బందికి చెప్పగా, బయటకు వెళ్లిన న్యాయవాది అరగంట తర్వాత తిరిగి హాల్‌లోపలికి వచ్చాడు. బుద్ధి లేదా అంటూ మళ్లీ సీఐ గట్టిగా అరుస్తూ 'గెట్ అవుట్.. ఇక్కడి నుంచి నడవవయ్యా అంటూ' బయటకు మళ్లీ పంపించాడు. దీంతో సదరు న్యాయవాది సోమవారం తనకు జరిగిన అవమానంపై బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశాడు.

## చోరీ కేసులో నలుగురికి జైలు

కథలాపూర్, ఫిబ్రవరి 24: ఇప్పపెల్లి గ్రామంలో ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ చేసిన కేసులో నలుగురికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ కోరుట్ల న్యాయమూర్తి పావని సోమవారం తీర్పునిచ్చారని కథలాపూర్ పోలీసులు తెలిపారు. గతేడాది జూలై 9న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సురేశ్, గంగ ప్రసాద్, ఎస్కే ఆసీఫ్, డిచ్‌పల్లికి చెందిన ఎస్కే ఖదీర్ ట్రాక్టర్ బ్యాటరీల దొంగతనానికి పాల్పడగా, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. సాక్షుల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నలుగురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

## బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన ఒకరిపై

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: బడి నుంచి ఇంటికి వస్తున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి 20రోజుల జైలుశిక్ష తోపాటు ₹26వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు. ధర్మపురికి చెందిన ఒడ్డేటి చంద్రతేజ 2021లో జగిత్యాల రూరల్ మండలంలోని ఓ గ్రామానికి పాఠశాల నుంచి వెళ్తు న్న ఇద్దరు పదేండ్లలోపు బాలికలపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికల తండ్రి జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ జరిపిన పోలీసులు చంద్రతేజ్‌పై కేసు నమోదు చేశారు. జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి.. నిందితుడు చంద్రతేజకు 20 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.